

మైనారిటీ యువతకు ఉచిత శిక్షణ

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మైనారిటీ(ముస్లిం, క్రిస్టియన్, సిక్కులు, బౌద్ధులు, జైనులు) యువతకు ఎస్‌ఐ, కానిస్టేబుల్, టెట్, డీఎస్సీ ఉద్యోగాల కోసం ఆన్‌లైన్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్టు జిల్లా మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఈడీ కె.కుమారస్వామి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. 'ఆసక్తి గల అభ్యర్థులు ఏపీసీఈడీఎంఎండబ్ల్యూడీ.ఓఆర్‌జీ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలి. బయోడేటాను విజయవాడలోని భవానీపురం సీఈడీఓ కార్యాలయానికి పంపాలి. మరిన్ని వివరాలకు 0866-2970567 ఫోన్ నెంబర్‌ను సంప్రదించాల'ని ఆయన సూచించారు.

ఇక్కడ మండలం.. అక్కడ రెవెన్యూ డివిజన్

- వైసీపీ హయాంలో అనాలోచితంగా జిల్లా పునర్విభజన
- పెరుగుతున్న రెవెన్యూ సమస్యలు
- ప్రజలకు తప్పని ఇబ్బందులు
- కూటమి ప్రభుత్వంపైనే ఆశలు
- లోపాలు సరిదిద్దే దిశగా చర్యలు


శ్రీకాకుళం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి)

వైసీపీ హయాంలో అనాలోచితంగా జిల్లా పునర్విభజన చేయడంతో కొన్ని మండలాల ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. నియోజకవర్గంలో ఉండే మండలాలు.. ఒకే రెవెన్యూ డివిజన్‌లో ఉండాలి. కానీ పలు నియోజకవర్గాల్లోని కొన్ని మండలాలను మరో రెవెన్యూ డివిజన్ పరిధిలో ఉంచడంతో ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. దీనిపై అప్పట్లో జిల్లాలోని వైసీపీ కీలక నాయకులు కూడా తమ అధినేతకు వివరించే పరిస్థితి లేదు. అధికారులు కూడా అనాలోచితంగా వ్యవహరించి.. ఇప్పుడు కొన్ని మండలాల ప్రజల అవస్థలకు కారణమయ్యారు.

● ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో పది నియోజకవర్గాల్లో 38 మండలాలు ఉండేవి. పునర్విభజనలో భాగంగా 2022లో పాలకొండ నియోజకవర్గాన్ని (నాలుగు మండలాలు) పార్వతీపురం మన్యం జిల్లాలో కలిపివేశారు. రాజాం నియోజకవర్గాన్ని (నాలుగు మండలాలు) విజయనగరంలో కలిపేశారు. దీంతో ఎనిమిది నియోజకవర్గాలు 30 మండలాలతో శ్రీకాకుళం జిల్లా మిగిలింది. గతంలో శ్రీకాకుళం, టెక్కలి, పాలకొండ రెవెన్యూ డివిజన్లు ఉండేవి. పాలకొండ స్థానంలో పలాస రెవెన్యూ డివిజన్‌ను కొత్తగా ఏర్పాటు చేశారు. అయితే కొన్ని మండలాలను అదే నియోజకవర్గంలో ఉంచి.. దూరంగా.. ప్రజలకు భారంగా ఉండే మరో రెవెన్యూ డివిజన్‌లో చేర్చారు.

● శ్రీకాకుళం, ఎచ్చెర్ల, ఆమదాలవలస, పలాస, ఇచ్ఛాపురం నియోజకవర్గాల ప్రజలకు రెవెన్యూ డివిజన్ పరంగా ఏవిధమైన సమస్య లేదు. వారికి సబ్‌డివిజన్లు అందుబాటులో ఉన్నాయి. ఏదైనా సమస్య వస్తే అక్కడకు (మిగతా 6వ పేజీలో..)







ఉపాధి వేతనదారుల ఈ-కేవైసీ నమోదును పరిశీలిస్తున్న అధికారులు


ఒక్కరోజే

- ఉపాధిహామీ వేతనదారుల ఈ-కేవైసీ నమోదుకు నేటితో గడువు సరి
- జిల్లాలో 78.07 శాతం ప్రక్రియ పూర్తి

నరసన్నపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఉపాధిహామీ వేతనదారుల ఈ-కేవైసీ నమోదుకు శుక్రవారంతో గడువు ముగియనుంది. ఉపాధిహామీ పథకంలో అక్రమాల నివారణకు కేంద్రప్రభుత్వం నేషనల్ మోనటరింగ్ సిస్టమ్(ఎన్ఎంఎంఎస్) నవంబరు 1 నుంచి అమలు చేయాలని నిర్ణయించింది. ఈ విధానంలో భాగంగా ఉపాధిహామీ కూలీలకు ఈ-కేవైసీ నమోదు ప్రక్రియ ఈ నెలాఖరులోగా పూర్తిచేయాలని ఇటీవల ఆదేశించింది. నవంబరు నుంచి ఈ-కేవైసీ పూర్తయిన కూలీలకు మాత్రమే ఉపాధి హామీ పనులకు అనుమతించాలని స్పష్టం చేసింది. ఈ మేరకు అధికారులు ఉపాధిహామీ కూలీల ఐరిస్ ఫొటోలు తీసుకుని (మిగతా 6వ పేజీలో..)

క్లోరినేషన్ ఎప్పుడు?

- శుభ్రతకు నోచుకోని రక్షిత నీటి పథకాలు
- ట్యాంకర్ల నిర్వహణను పట్టించుకోని అధికారులు
- ప్రజారోగ్యంపై ప్రభావం



ఇచ్ఛాపురం సురంగిరాజావారి కోట సమీపంలోని రక్షిత నీటి పథకం

ఇచ్ఛాపురం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లావాసులకు ట్యాంకుల ద్వారా సురక్షితనీరు సక్రమంగా అందడం లేదు. జిల్లాలో జల్ జీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ రక్షితనీరు అందించాలన్న ప్రయత్నాలు జరుగుతున్నాయి. కానీ మరోవైపు దశాబ్దాల కిందట నిర్మించిన రక్షితనీటి పథకాలు(ట్యాంకులు) శిథిలావస్థకు చేరుకుంటున్నాయి. ఆ ట్యాంకులను శుభ్రం చేయకపోవడంతో ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశం ఉంది. జిల్లావ్యాప్తంగా ఆర్‌డబ్ల్యూఎస్ ఆధ్వర్యంలో 1075 గ్రామాల్లో రక్షితనీటి పథకాలు ఉన్నాయి. ఒక్కో ట్యాంకు లక్షమంది వరకూ తాగునీరు అందిస్తోంది. దాదాపు సగం ట్యాంకుల మెట్లు, నిచ్చెనలు పాడయ్యాయి. కొన్ని శిథిలావస్థకు చేరుకుని లీకులకు గురవుతున్నాయి. ట్యాంకులపై మొక్కలు మొలచి, పక్షులు మలమూత్ర విసర్జన చేస్తున్నాయి. కనీసం శుభ్రం చేసిన దాఖలాలు లేవు. దీంతో తాగునీరు కలుషితమై.. ప్రజారోగ్యానికి విఘాతంగా మారుతోంది.

● ఉద్దానం ప్రాజెక్టు పరిధిలో..

ఇచ్ఛాపురం, పలాస నియోజకవర్గాలకుగాను ఉద్దానం సమగ్ర మంచినీటి పథకం ద్వారా తాగునీరు అందిస్తున్నారు. హిరమండలంలోని వంశధార రిజర్వాయర్‌లో మదర్ ట్యాంకును నిర్మించి అక్కడి నుంచి మెళియాపుట్టి వద్ద ప్లాంట్లు ద్వారా శుద్ధి చేసి నీటిని ట్యాంకర్లలో విడిచిపెడుతున్నారు. అక్కడ నుంచి గ్రామాలకు సరఫరా చేస్తున్నారు. ట్యాంకులు సరిగ్గా లేకపోవడంతో నీరు కలుషితమవుతోందని ఉద్దానం గ్రామాల ప్రజలు చెబుతున్నారు. కొన్నిచోట్ల రంగు మారుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఆ నీరు తాగి అనారోగ్యానికి గురవుతున్నామని వాపోతున్నారు. ఉద్దానం సమగ్ర మంచినీటి పథకానికి రూ.750 కోట్లు ఖర్చుచేశారు. కొత్త ట్యాంకులను సైతం నిర్మించారు. కానీ చాలా పాత ట్యాంకులకు సైతం అనుసంధానం చేశారు. వీటితోనే ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

● సమన్వయ లోపం

తాగునీటి ట్యాంకుల నిర్వహణపై ఆర్‌డబ్ల్యూఎస్, పంచాయతీ శాఖ అధికారుల మధ్య వాదనలు జరుగుతున్నాయి. ట్యాంకుల నిర్వహణ మీదంటే మీదేనంటూ ఒకరిపై ఒకరు నెపం వేస్తున్నారు. రక్షితనీటి ట్యాంకులను విధిగా రెండు నెలలకు ఒకసారి శుభ్రం చేయాలి. అయితే ఎక్కడా శుభ్రం చేస్తున్న దాఖలాలు లేవు. ఆర్‌డబ్ల్యూఎస్ కనీస పర్యవేక్షణ లేకపోవడంతో కొన్ని ట్యాంకులపై పిచ్చి మొక్కలు కూడా దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఉద్దానం సమగ్ర మంచినీటి పథకాన్ని మెగా కంపెనీ నిర్వహిస్తోంది. వారికి ఆర్‌డబ్ల్యూఎస్ సిబ్బందికి మధ్య సమన్వయం కుదరడం లేదు. దీంతో మంచినీటి పథకాల నిర్వహణలో ఇబ్బందికర పరిస్థితులు ఎదురవుతున్నాయి. దీనిపై ఇప్పటికైనా జిల్లా యంత్రాంగం దృష్టి సారించాల్సిన అవసరం ఉంది.

పుణ్యక్షేత్రాల సందర్శనలో అపశ్రుతి

- ఉత్తరప్రదేశ్‌లో రోడ్డు ప్రమాదం
- జిల్లా వాసులకు గాయాలు
- స్పందించిన కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు



క్షతగాత్రులకు చికిత్స చేస్తున్న వైద్యులు



పెద్దదూగాం వాసులను అంబులెన్స్‌లో ఆస్పత్రికి తరలిస్తున్న దృశ్యం

శ్రీకాకుళం/ కోటబొమ్మాళి/ పలాస రూరల్/ జలుమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లిన జిల్లావాసులకు అపశ్రుతి ఎదురైంది. ఉత్తరప్రదేశ్‌లో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో జిల్లాకు చెందిన 16 మందికి గాయాలయ్యాయి. సమాచారం తెలుసుకున్న వెంటనే కేంద్రపౌరవిమానయాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్‌నాయుడు స్పందించారు. వారికి మెరుగైన వైద్యం అందేలా చొరవ చూపారు. వివరాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్ రాష్ట్రం జౌన్‌పూర్‌లో గురువారం మధ్యాహ్నం రోడ్డు ప్రమాదం సంభవించింది. జిల్లాలోని పలాస, కోటబొమ్మాళి, బ్రాహ్మణతర్లాకు చెందిన 16మంది గాయపడ్డారు. స్థానికులు వారిని సమీప ఆస్పత్రులకు తరలించగా.. చికిత్స పొందుతున్నారు. క్షతగాత్రుల్లో కోటబొమ్మాళి గ్రామానికి చెందిన బోయిన ముత్యాలరావు, ఉషారాణి దంపతులు, జామి కిషోర్ ఉన్నారు. వీరు కొత్తపేట, బ్రాహ్మణతర్లా, పలాస, పార్వతీపురంలోని బంధువులతో కలిసి పుణ్యక్షేత్రాల సందర్శనకు వెళ్లారు. మొత్తం 70మంది వెళ్లగా అందులో కొత్తపేట, కోటబొమ్మాళికి చెందిన 40మంది ఉన్నారు. వీరంతా కాశీ-వారణాసిలో తొమ్మిది రోజులు పూజలు చేశారు. అక్కడ నుంచి గురువారం ఉదయం మూడు వాహనాల్లో అయోధ్యకు పయనమయ్యారు. 16 మంది ప్రయాణిస్తున్న ఓ వాహనాన్ని ఉత్తరప్రదేశ్‌లో లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో వాహనంలో ఉన్న 15మందికి స్వల్ప గాయాలయ్యాయి. బ్రాహ్మణతర్లాకు చెందిన వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయని వారితో యాత్రకు వెళ్లిన కోటబొమ్మాళికి చెందిన లాడి వెంకటేశ్వరరావు 'ఆంధ్రజ్యోతి'కి ఫోన్‌లో తెలిపారు.

● జలుమూరు మండలం పెద్దదూగాం గ్రామానికి చెందిన పొట్నూరు సత్యనారాయణ, సత్యవతి దంపతులకు కూడా గాయాలయ్యాయి. కోటబొమ్మాళికి చెందిన బంధువులతో కలిసి వీరిద్దరూ ఈ నెల 19న కాశీ పయనమయ్యారు. ప్రస్తుతం వైద్యసేవలు అందడంతో తాము క్షేమంగా ఉన్నట్టు కుటుంబ సభ్యులకు సమాచారం అందజేశారు.

●పలాస (మిగతా 6వ పేజీలో..)



మాట్లాడుతున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

చట్టం అమలులో నిర్లక్ష్యాన్ని సహించం

- ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): లింగ నిర్ధారణ చట్టం అమలులో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అధికారులను, వైద్య సిబ్బందిని హెచ్చరించారు. కలెక్టరేట్‌లో గురువారం జిల్లాస్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. గత సమావేశంలో కీలక గణాంకాలు సమర్పించకపోవడంపై డీఎంహెచ్‌ఓ కార్యాలయ సిబ్బందిపై అసంతృప్తి వ్యక్తం చేశారు. జూలై నుంచి నమోదైన గర్భిణులు, గర్భస్రావాల వివరాలను సమీక్షించారు. 'ఎల్.ఎన్.పేట పీహెచ్‌సీలో 11శాతం, బొంతుపేట పీహెచ్‌సీలో 10శాతం గర్భస్రావాలు నమోదయ్యాయి. ఇది జాతీయ సగటు కంటే అధికంగా ఉంది. ఇక్కడ ప్రత్యేక నిఘా బృందాలు ఏర్పాటు చేయాలి. స్కానింగ్ కేంద్రాల తనిఖీలను మరింత కఠినతరం (మిగతా 6వ పేజీలో..)



నాగావళి ఉగ్రరూపం

శ్రీకాకుళం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో నాగావళి నది ఉగ్ర రూపం దాల్చింది. మొంథా తుపాన్ ప్రభావంతో జిల్లాలో భారీ వర్షాలు కురవగా.. ఒడిశా నుంచి కూడా వరదనీరు వచ్చి నదిలో చేరింది. అక్కడ వర్షాల కారణంగా ప్రాజెక్టుల్లో చేరిన అదనపు నీటిని విడిచిపెట్టారు. దీంతో ఆ నీరు నాగావళి నదిలో కలిసి.. ఉధృతంగా ప్రవహిస్తోంది. అలాగే కళ్లేపల్లి వద్ద బంగాళాఖాతంలో నాగావళి కలుస్తుండటంతో ఆ ప్రాంతం మరింత ఉగ్రంగా మారిపోయింది.



రక్తదానం చేస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగానికి ప్రాధాన్యం

- రక్తదానం మానవతాసేవ: ఎస్పీ మహేశ్వరరెడ్డి 7లో

బ్రాహ్మణతర్లా వద్ద పొదల్లో చిక్కుకుని..

- వరహాల గెడ్డలో గల్లంతైన వ్యక్తి మృతదేహం గుర్తింపు 8లో

వేటకు వెళ్లి.. మత్స్యకారుడి మృతి



భీమారావు (ఫైల్)

సంతబొమ్మాళి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): సంతబొమ్మాళి మండలం నౌపడ పంచాయతీ సీతానగరం గ్రామానికి చెందిన మత్స్యకారుడు బచ్చల భీమారావు(55) చేపల వేటకు వెళ్లి గురువారం మృతి చెందాడు. గ్రామంలోని ముసళ్లఖానా సమీపంలో చేపల వేట కోసం నీటి ప్రవాహానికి అడ్డంగా వలను ఏర్పాటు చేశాడు. కొంత సమయం తర్వాత ఆ వల తీసే ప్రయత్నంలో ప్రమాదవశాత్తూ నీటిలో మునిగిపోయాడు. వరదనీటి ఉధృతి ఎక్కువగా ఉండడంతో ప్రాణాలు కోల్పోయాడు. దీంతో కుటుంబ సభ్యులు, గ్రామస్థులు విషాదంలో మునిగిపోయారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేసినట్లు నౌపడ ఎస్.ఐ నారాయణస్వామి తెలిపారు.

వర్షం.. తీరని కష్టం!

● తుఫాన్‌తో అన్నదాత కుదేలు

● పొలాల్లో నిలిచిన నీరు

మొంథా తుఫాన్ రైతుకు కోలుకోలేని దెబ్బ తీసింది. నేడో రేపో కోతకు సిద్ధమవుదామనుకున్న తరుణంలో పంటలను ముంచేసింది. పొలాల నుంచి నీరు పోయే మార్గం తెలియక అన్నదాతలు కన్నీరుమున్నీరవుతున్నారు. కొన్నిచోట్ల వరిలో మొలకలు వచ్చాయి. అనేక గ్రామాల్లో రహదారులు కోతకు గురయ్యాయి. కల్వర్టులు కొట్టుకుపోయాయి. చెరువులు, కాలువలకు గండ్లు పడకుండా రైతులు, స్థానికులు జాగ్రత్తలు తీసుకుంటున్నారు.

-ఆంధ్రజ్యోతి బృందం


ఎల్ఎన్‌పేట: వర్షాలకు కూలిన ఇంటి గోడ


పోలాకి: నీట మునిగిన తంపర పంట పొలాలు


లావేరు: భీమునిపాలెంలో దెబ్బతిన్న పత్తిపంట


నందిగాం: దీనబంధుపురంలో నేలకొరిగిన చేనును కట్టలు కడుతున్న రైతు


జి.సిగడాం :ధవళపేటలో నేలకొరిగిన వరిచేనును చూస్తున్న రైతు


జలుమూరు: యలమంచిలి వద్ద మొలకలను చూపిస్తున్న రైతులు



శ్రీకాకుళం రూరల్: కుశాలపురం రోడ్డులో దిగబడిన స్కూల్ బస్సు


హిరమండలం: అంబావల్లి గ్రామంలో ముంపునకు గురైన వరిని చూపుతున్న రైతు


శ్రీకాకుళం రూరల్: పెద్దగణగళ్లవాని పేట తుఫాన్ భవనంలో వైద్య సేవలు అందిస్తున్న సిబ్బంది


శ్రీకాకుళం రూరల్: పెద్దగణగళ్లవానిపేట తీరంలో పాక పైకప్పులు ఎగిరిపోయిన దృశ్యం


శ్రీకాకుళం రూరల్: కూర్మయ్యపాలెంలో నేలకొరిగిన వరి


రణస్థలం: మీసాలబడి రోడ్డును బాగు చేస్తున్న దృశ్యం


పాతపట్నం రూరల్: నీటిలో తడుస్తున్న వరి పంట

ఇక్కడ మండలం.. అక్కడ రెవెన్యూ డివిజన్

(ఐదో పేజీ తరువాయి)

వెళ్లి పరిష్కరించుకుంటున్నారు.

● టెక్కలి నియోజకవర్గంలో 'నందిగాం' మండలాన్ని పునర్విభజన సమయంలో టెక్కలి నియోజకవర్గంలో ఉంచుతూ.. రెవెన్యూ డివిజన్‌ను మాత్రం పలాసలో చేర్చారు. దీంతో ఈ మండల ప్రజలు రెవెన్యూ, ఇతర సమస్యలను విన్నవించుకునేందుకు ఇబ్బందులు పడుతూ పలాస వెళ్తున్నారు. నందిగాం మండలాన్ని టెక్కలి డివిజన్‌లో కలిపేయాలంటూ ఎన్నిసార్లు విన్నవించుకున్నా ఫలితం లేదు.

● నరసన్నపేట నియోజకవర్గంలో సారవకోట మండలాన్ని టెక్కలి రెవెన్యూ డివిజన్‌లో కలిపేశారు. అంతకుముందు 'సారవకోట' మండలం పాలకొండ డివిజన్‌లో ఉండేది. ఇప్పుడు శ్రీకాకుళానికి కాస్త దగ్గరగా ఉన్న సారవకోట ప్రజలకు.. రెవెన్యూ పరమైన సమస్యల పరిష్కారం కోసం టెక్కలి వెళ్లాలంటే ఇబ్బందికరమే.

● పాతపట్నం నియోజకవర్గంలో పాతపట్నం, మెళియాపుట్టి, ఎల్.ఎన్.పేట, హిరమండలం, కొత్తూరు మండలాలు ఉన్నాయి. ఇందులో ఎల్.ఎన్.పేట, హిరమండలం మండలాలకు శ్రీకాకుళం దగ్గర. ఈ మండలాల ప్రజలు ఎప్పటి నుంచో.. తమను శ్రీకాకుళం రెవెన్యూ డివిజన్‌లో కలపాలని కోరుతూ కేంద్ర, రాష్ట్ర మంత్రులకు వినతిపత్రాలు అందజేశారు. ఇది ఎప్పటికి కార్యరూపం దాల్చేనో.

● **ప్రభుత్వ చర్యలతో ఆశలు..**

వైసీపీ సర్కారు సమయంలో జరిగిన తప్పిదాన్ని సరి చేయాలని కూటమి ప్రభుత్వం నిర్ణయించింది. ఇప్పటికే మంత్రివర్గం రాష్ట్రవ్యాప్తంగా నియోజకవర్గాల్లో.. కొన్ని మండలాలు.. మరో రెవెన్యూ డివిజన్‌లో ఉండటంపై చర్చించి చర్యలు తీసుకునేందుకు సిద్ధమైంది. ఇదే సమయంలో శ్రీకాకుళం జిల్లాలో కొన్ని నియోజకవర్గాలలో మండలాలు.. మరో రెవెన్యూ డివిజన్‌లో ఉండటంపై.. సమగ్ర నిర్ణయం తీసుకోవాలని జిల్లావాసులు కోరుతున్నారు. ప్రజలకు ఆమోదంగా ఉండేలా దగ్గరగా.. సౌలభ్యంగా ఉండే రెవెన్యూ డివిజన్‌లో ఉంచాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

పుణ్యక్షేత్రాల సందర్శనలో అపశ్రుతి

(ఐదో పేజీ తరువాయి)

మండలం బ్రాహ్మణతర్లా గ్రామానికి చెందిన పట్నాన వజ్రంమూర్తికి తలపై గాయాలు కాగా, ఆయన భార్య రమాదేవికి చేయి విరిగిపోయింది. ఈ దంపతులిద్దరూ ఈ నెల 18న పలాస నుంచి వారణాసికి రైలులో వెళ్లారు. అక్కడ గయా, ప్రయాగ, కాలభైరవ, అలహాబాద్ క్షేత్రాలను సందర్శించారు. వారణాసి నుంచి అయోధ్యకు వెళ్తుండగా ప్రమాదం జరిగిందని వారి బంధువులకు సమాచారం అందడంతో ఆందోళన చెందుతున్నారు.

● **కేంద్రమంత్రి భరోసా..**

ప్రమాద సమాచారం తెలుసుకున్న వెంటనే కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు తక్షణ చర్యలు ప్రారంభించారు. ఢిల్లీ నుంచి క్షతగాత్రులను ఫోన్‌లో పరామర్శించి వారికి ధైర్యం చెప్పారు. జౌన్‌పూర్ కలెక్టర్, వారణాసి విమానాశ్రయ అధికారులు, వైద్యులతో మాట్లాడారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు. క్షతగాత్రుల ఆరోగ్యం మెరుగుపడుతోందని, వారిని సురక్షితంగా స్వస్థలాలకు తరలించేలా ఏర్పాట్లు చేస్తామని కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తెలిపారు.

● ఈ ఘటనపై జిల్లాఇన్‌చార్జి మంత్రి కొండపల్లి శ్రీనివాస్, వ్యవసాయశాఖ మంత్రి అచ్చెన్నాయుడు దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బాధితులతో ఫోన్‌లో మాట్లాడి ప్రమాదం జరిగిన తీరు.. క్షతగాత్రులకు అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. కేంద్రమంత్రి రామ్మోహన్‌నాయుడు, జిల్లా కలెక్టర్‌తోపాటు.. అయోధ్య, జౌన్‌పూర్ కలెక్టర్‌లతో ఫోన్‌లో మాట్లాడారు. మెరుగైన వైద్యం అందించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. బాధితులకు ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

ఒక్కరోజే

(ఐదో పేజీ తరువాయి)

యాప్‌లో వివరాలు నమోదు చేస్తున్నారు. కాగా ఈ ప్రక్రియ నత్తనడకన సాగుతోంది. జిల్లాలో 7,11,043 మంది వేతనదారులు ఉన్నారు. వీరిలో గురువారం సాయంత్రానికి 5,54,524 మంది(78.07 శాతం) వేతనాదారులకు ఈ-కేవైసీ నమోదు పూర్తయింది. ఇంకా 1,56,519 మంది వేతనదారులకు ఈ-కేవైసీ చేయాల్సి ఉంది. వీరిలో జాబ్‌కార్డు పొంది క్షేత్రస్థాయిలో పనిరానివారు సుమారు 60వేల మంది ఉంటారని డ్వామా అధికారులు చెబుతున్నారు. వలసదారులతోపాటు మరికొందరు మృతిచెందిన వారూ ఉంటారని పేర్కొంటున్నారు. క్షేత్రస్థాయిలో పనికి వచ్చిన కూలీలకు దాదాపు 90శాతం మేరకు ఈ-కేవైసీ పూర్తయిందని డ్వామా పీడీ బి.సుధాకరరావు తెలిపారు. ఇంకా మిగిలిన కూలీలను గుర్తించి.. ఈ కేవైసీ నమోదు శతశాతం పూర్తిచేయాలని సిబ్బందికి ఆదేశించామన్నారు.

చట్టం అమలులో నిర్లక్ష్యాన్ని సహించం

(ఐదో పేజీ తరువాయి)

చేయాలి. జిల్లాలో మొత్తం 130 స్కానింగ్ మెషీన్లు(ప్రైవేటు-101, ప్రభుత్వ -29) ఉన్నాయి. అన్ని కేంద్రాల్లో సీసీ కెమెరాలు ఉన్నా, క్షేత్రస్థాయిలో ఎప్పటికప్పుడు తనిఖీలు చేయాల'ని ఆదేశించారు. సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ డి.పృథ్వీరాజ్ కుమార్, ఏఎస్పీ శ్రీనివాసరావు, డీఎంహెచ్‌ఓ డా.అనిత, కమిటీ కన్వీనర్ డా.శ్రీకాంత్, డీఐఓ డా.రాందాసు, డీసీహెచ్‌ఎస్ డా.కళ్యాణబాబు, డా.దానేటి శ్రీధర్, బెజ్జిపురం యూత్‌క్లబ్ ప్రసాదరావు, మంత్రి వెంకటస్వామి పాల్గొన్నారు.

గోసేవతో ఎంతో పుణ్యం

రణస్థలం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రతి ఒక్కరూ గోసేవ చేయడం వల్ల ఎంతో పుణ్యం లభిస్తుందని ఎస్‌కేసీఎం గోసేవా ఆశ్రమానికి చెందిన త్రిదండి స్వామి భక్తి సౌధవ్ కేశవ్ గోస్వామి అన్నారు. బంటుపల్లి రెవెన్యూ పరిధిలోని గోశాల వద్ద గురువారం గోపాష్టమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ గోశాలలో ఉన్న వందలాది గోవులకు భక్తులు పూజలు చేశారు. గోమాత జన్మదినం సందర్భంగా గోపూజ, గోహారతి, గో ప్రదక్షిణ, గోదానం చేశారు. గోమాతకు 56 రకాల నైవేద్యాలు సమర్పించారు. ఈ సందర్భంగా స్వామీజీ మాట్లాడుతూ గోపాష్టమి రోజున గోవులను పూజించడం వల్ల సమస్త గ్రహదోషాలు తొలిగి... జీవితం ఆనందమయం అవుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరయ్యారు.


గోమాతలకు 56 రకాల నైవేద్యాలు సమర్పిస్తున్న దృశ్యం


గోశాలలో పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆదాయ వనరులను సమకూర్చేందుకు ప్రణాళిక

కోటబొమ్మాళి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండల పరిషత్‌కు ఆదాయ వనరులు సమకూర్చే విధంగా ప్రణాళికలు తయారు చేసుకోవాలని టెక్కలి ఆర్డీవో ఎన్.కృష్ణమూర్తి ఆదేశించారు. ఆయన గురువారం మండల పరిషత్ కార్యాలయానికి సంబంధించి ఎదురుగా ఉన్న పాత సిబ్బంది గృహాలను, ఖాళీస్థలాన్ని పరిశీలించారు. ఈ స్థలాలకు సంబంధించిన మ్యాప్ అందజేయాలని తహసీల్దార్ ఆర్.అప్పలరాజును ఆదేశించారు. అలాగే ప్రస్తుతం ఈ స్థలంలో ఉన్న కార్యాలయాలపై ఎంపీడీవో కె.ఫణీంద్రకుమార్‌ను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎస్సీ బాలుర వసతి గృహాన్ని పరిశీలించి వసతులపై వార్డెన్ సీతారామ్‌ను అడిగి తెలుసుకున్నారు.


అధికారులతో మాట్లాడుతున్న ఆర్డీవో కృష్ణమూర్తి

వరదనీటిలో అంగన్‌వాడీ కేంద్రాలు

కోటబొమ్మాళి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గడిచిన నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలతో కోటబొమ్మాళి మండల కేంద్రంలో గల రెడ్డిక వీధి, మెయిన్ రోడ్డుకు సంబంధించిన అంగన్‌వాడీ కేంద్రాలు వరద నీటిలో చిక్కుకుపోయాయి. ఈ కేంద్రాలకు పిల్లలను పంపించటానికి భయమేస్తోందని తల్లిదండ్రులు వాపోతున్నారు. పంచాయతీ కార్యాలయం వెనుక నుంచి వస్తున్న వరదనీరు ఈ కేంద్రాలు చుట్టూ నెలలకొద్దీ నిల్వ ఉంటుందని.. దోమలు, దుర్వాసనతో పిల్లలు ఇబ్బందులు పడుతున్నా రని తల్లిదండ్రులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ అంగన్‌వాడీ భవనాలు లోతట్టు ప్రాంతం లో ఉండటంతో చుట్టు పక్కల నుంచి వర్షపు నీరు ఇక్కడికి చేరుతోందని చెబుతున్నారు. రోజుల తరబడి నీరు నిల్వ ఉండడంతో దోమలు స్వైరవిహారం చేస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ కార్యాలయాల చుట్టూ మట్టిపోసి.. చదునుచేసి నీరు బయటకు పోయేందుకు మార్గం చూపాలని సంబంధిత అధికారులకు ఎన్నోసార్లు కోరినప్పటికీ ఫలితం లేకపోయిందని వాపోతున్నారు.



రెడ్డికవీధిలోని అంగన్‌వాడీ కేంద్రం వద్ద నిలిచిన నీరు

కోరన్న, మంగన్న స్మారక సభ నేడు

పాత శ్రీకాకుళం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): భూస్వామ్య సామ్రాజ్యవాద దోపిడీకి వ్యతిరేకంగా పోరాడి ప్రాణాలర్పించిన కోరన్న, మంగన్నలను స్మరించుకుంటూ శుక్రవారం నిర్వహించనున్న వర్ధంతి సభను విజయవంతం చేయాలని రైతు కూలీ సంఘం నాయకులు కోరారు. ఈ మేరకు గురువారం పట్టణంలోని చౌదరి సత్యనారాయణ కాలనీలో సంఘ కార్యాలయంలో విలేకరులతో సంఘం జిల్లా కార్యదర్శి టి.అరుణ మాట్లాడుతూ.. శుక్రవారం మధ్యాహ్నం 3 గంటలకు శ్రీకాకుళం కొత్తరోడ్డు వద్ద ఉన్న అమరవీరుల స్మారక స్థూపం వద్ద వర్ధంతి సభను నిర్వహిస్తున్నామన్నారు. 1958లో కమ్యూనిస్టు పార్టీ ఆధ్వర్యంలో గిరిజన సంఘం ఏర్పాటు ద్వారా ఆదివాసీల దోపిడీకి, ఫారెస్ట్ అధికారుల దౌర్జన్యానికి, వ్యాపారుల అధిక వడ్డీ రేట్లకు వ్యతిరేకంగా ఐక్యంగా కోరన్న, మంగన్నలు పోరాటం చేశారన్నారు. 1967 అక్టోబరు 31న మొండెంఖల్ మహాసభకు హాజరైన గిరిజనులపై భూ స్వాములు దాడి చేయగా కోరన్న, మంగన్న అమరులయ్యారని, వారిని స్మరించుకుంటూ ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ఈ సభకు రైతు కూలీ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు సింహాద్రి ఝాన్సీ, రాష్ట్ర అధ్యక్షుడు గణేష్‌పండా, ఏఐఎఫ్ టీయూ రాష్ట్ర అధ్యక్షుడు దంతలూరి వర్మ, రైతు కూలీ సంఘం రాష్ట్ర కార్యదర్శి పి.శ్రీను నాయుడు తదితరులు హాజరవుతారన్నారు.

ఘనంగా సామూహిక కుంకుమ పూజలు

కంచిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కర్తలి గ్రామ దేవత మహాలక్ష్మి అమ్మవారి ఆలయ వార్షికోత్సవాన్ని గురువారం ఘనంగా నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేకపూజలు, అభిషేకాలు నిర్వహించారు. దేవాలయ ప్రాంగణంలో మహిళలతో సామూహిక కుంకుమ పూజలు చేపట్టారు. మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాద వితరణ చేశారు. చుట్టుపక్కల గ్రామాల భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.


సామూహిక కుంకుమ పూజల్లో పాల్గొన్న మహిళలు

అంతిమ యాత్రకు ఎన్ని కష్టాలో..

జి.సిగడాం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కప్పరాం గ్రామానికి సంబంధించి స్వర్గధామానికి వెళ్లేందుకు స్థానికులు లేకపోవటంతో గ్రామస్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి చెందిన పండూరి నరసమ్మ గురువారం మృతి చెందింది. ఆమె మృతదేహాన్ని శ్మశానానికి తరలించేందుకు స్థానికులు, బంధువులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మద్దువలస కుడి ప్రధాన కాలువలో దిగి తీసుకెళ్లాల్సి వచ్చింది. గత 26 ఏళ్లుగా ఇవే అవస్థలు పడుతున్నామని గ్రామానికి చెందిన పలిశెట్టి గోపాలరావు తదితరులు తెలిపారు. ముగ్గురు ఎమ్మెల్యేలు మారినా తమ అవస్థలు మారలేదని అన్నారు. మద్దువలస కాలువ మీద వంతెన నిర్మించకపోవటంతో స్వర్గధామానికి వెళ్లడానికి అవస్థలు పడుతున్నామని తెలిపారు. ఇప్పటికైనా ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రహదారి నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.


కాలువ మీదుగా మృతదేహాన్ని తీసుకువెళుతున్న దృశ్యం

బయో మెడికల్ వ్యర్థాలను సక్రమంగా నిర్వహించాలి

● ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

శ్రీకాకుళం కలెక్టరేట్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రులు బయో మెడికల్ వ్యర్థాల నిర్వహణను సక్రమంగా, కచ్చితంగా చేపట్టాలని ఇన్‌చార్జి కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో గురువారం కాలుష్య నియంత్రణ చర్యలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రోగులు, సిబ్బంది, ప్రజల ఆరోగ్య భద్రత దృష్ట్యా వ్యర్థాలను సక్రమంగా వేరు చేసి, శాస్త్రీయ పద్ధతిలో నిర్వహించాలన్నారు. ఆసుపత్రులు రెడ్, ఎల్లో, బ్లూ, వైట్ రంగుల కోడింగ్ బ్యాగులు ఉపయోగించి, ఇంజక్షన్, సూదులు, కాటన్, గ్లౌస్, శరీర వ్యర్థాలను వేరుచేయాలన్నారు. కాలం చెల్లిన మందులను సాధారణ చెత్తతో కలిపి పారవేస్తే పర్యావరణానికి, ప్రజారోగ్యానికి తీవ్ర ముప్పు కలుగుతుందన్నారు. ఆసుపత్రి, క్లినిక్, ల్యాబ్‌ల వద్ద ఉత్పత్తి అయ్యే వ్యర్థాల వివరాలను బయో మెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్ యాప్‌లో ప్రతీరోజు నమోదు చేయాలని స్పష్టం చేశారు. అనంతరం 'చెత్తను వేరుచేసే ముందు ఆలోచించండి' పోస్టర్‌ను ఆవిష్కరించారు. సమావేశంలో కాలుష్య నియంత్రణ మండలి ఈఈ బి.కరుణశ్రీ, డీఎంహెచ్‌వో డా.అనిత, డీసీహెచ్ఎస్ డా.కల్యాణబాబు తదితరులు పాల్గొన్నారు.

కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగానికి ప్రాధాన్యం

● ఎస్పీ మహేశ్వరరెడ్డి

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పెండింగ్‌లో ఉన్న కేసుల దర్యాప్తులో నాణ్యత, వేగం ప్రాధాన్యంగా గుర్తించి పర్యవేక్షించాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి ఆదేశించారు. జిల్లా పోలీసు కార్యాలయంలో గురువారం పోలీసు అధికారులతో నెలవారీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేసుల దర్యాప్తులో భౌతిక ఆధారాలు, సాధన కీలకమైన దశ అని, ప్రతి పోలీస్ అధికారి వృత్తిపరమైన, నిబద్ధతతో వ్యవహరించాలన్నారు. సాక్ష్యాలను శాస్త్రీయంగా సేకరించి చార్జిషీట్లు సమయానికి దాఖలు చేయాలన్నారు. కోర్టులో సరైన ఆధారాలతో దర్యాప్తు పత్రాలు సిద్ధం చేయాలన్నారు. ప్రజల ఫిర్యాదులను గౌరవంగా స్వీకరించి వెంటనే విచారణ చేపట్టాలని సూచించారు. ప్రాధాన్యత కేసులు త్వరితగతిన విచారానికి వచ్చే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. పాత నేరస్తుల కదలికలపై దృష్టిసారించి ఎటువంటి అల్లర్లు, గొడవలు లేకుండా చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం వివిధ అంశాల్లో ప్రతిభ కనబరిచిన పోలీసు అధికారులు, సిబ్బందికి ప్రశంసా పత్రాలు అందించారు. అలాగే జిల్లా వ్యాప్తంగా ఉన్న పోలీస్ వాహనాలను తనిఖీ చేశారు. సమావేశంలో ఏఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణరావు, పరిపాలనాధికారి గోపీనాథ్, సీఐ ఇమ్మాన్యుయేల్‌రాజు తదితరులు పాల్గొన్నారు.

రక్తదానం మానవతాసేవ

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రక్తదానంతో ఎందరి ప్రాణాలను కాపాడవచ్చని, రక్తదానం మానవతా సేవ అని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల స్మారక వారోత్సవాల్లో భాగంగా గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో రక్తదాన శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రక్త దానం చేసి యువతకు స్ఫూర్తిగా నిలిచారు. ఆయన మాట్లాడుతూ.. అమరవీరుల స్మారక ఉత్సవాల్లో భాగం గా పోలీస్ సిబ్బంది ఆరోగ్య సంరక్షణకు, సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యతనిస్తూ ఈ మెగా వైద్య శిబిరం, రక్తదాన శిబిరం నిర్వహిస్తున్నామన్నారు. పోలీస్ సిబ్బంది తమ ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలన్నారు. 100 మంది పోలీస్ అధికారులు, సిబ్బంది, మహిళా పోలీసులు రక్త దానం చేశారు. మెడికవర్ ఆసుపత్రి వైద్యులు రక్త పోటు, సుగర్, కంటి పరీక్షలు, సాధారణ ఆరోగ్య పరీక్షలు చేపట్టారు. రక్తదాతలకు ఎస్పీ మహేశ్వ రరెడ్డి ప్రశంసా పత్రాలు, మెడల్స్ అందించి అభినం దించారు. కార్యక్రమంలో ఏఎస్పీలు కేవీ రమణ, పి.శ్రీనివాసరావు, రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావు, డీఎస్పీలు వివేకానంద, లక్ష్మణ రావు, శేషాద్రి, పోలీస్ యూనిట్ వైద్యుడు విజయ్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

బీమా చెక్కు అందజేత

శ్రీకాకుళం క్రైం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పోలీస్ శాలరీ ప్యాకేజీ బీమా ద్వారా వచ్చే లబ్ధిని ప్రతి ఒక్కరూ వినియోగించుకో వాలని ఎస్పీ కేవీ మహేశ్వర రెడ్డి అన్నారు. పోలీస్ శాఖలో విధులు నిర్వహిస్తూ గత జూన్‌లో టెక్కలి వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో హెడ్ కానిస్టేబుల్ పి.జగదీశ్వర రావు మృతి చెందారు. ఎస్‌బీఐ పోలీస్ శాలరీ ప్యాకేజీలో భాగంగా మంజూరైన వ్యక్తిగత బీమా రూ.కోటి చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు గురువారం జిల్లా పోలీసు కార్యాలయంలో అందజేశారు. ఈ పథకం పోలీస్ అధికారులు, సిబ్బంది, వారి కుటుం బాలకు ప్రమాద, అత్యవసర సమయాల్లో భరోసా కలిగిస్తుందన్నారు. ప్రతి ఒక్కరు తమ ఖాతాను ఈ పోలీస్ శాలరీ ప్యాకేజీకి అను సంధానం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఎస్‌బీఐ ప్రాంతీయ మేనేజర్ గోవింద్‌కుమార్, మేనేజర్ సతీష్ కుమార్, ఏఎస్పీలు పాల్గొన్నారు.



జగదీశ్వరరావు కుటుంబ సభ్యులకు చెక్కును అందిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

స్టడీ మెటీరియల్ పంపిణీ

సోంపేట/కవిటి/ఇచ్ఛాపురం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): విశాఖప ట్నానికి చెందిన జుత్తు జగ్గన్న మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సోంపేట, కవిటి, ఇచ్ఛాపురం మండలాల్లోని విద్యార్థులకు స్టడీమెటీరియల్‌ను గురువారం అందజేశారు. ఒడియా, ఇంగ్లీషు మీడియం స్టడీ మెటీరియల్ అందిం చారు. సంస్థ అధ్యక్షుడు జి.సింహాచలం మాట్లాడుతూ జిల్లాలో 20 మండలాల్లో వీటిని అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఎంఈవోలు ధనుంజయ మజ్జి, ఎస్.రామకృష్ణ, కురమాన అప్పారావు, విశ్వనాథం, హెచ్ఎం బి.మల్లేశ్వరరావు, ఒడియా డీఐ దుర్గాప్రసాద్ చౌదరి తదితరులు పాల్గొన్నారు.

'మొంథా' బాధితులకు ఆర్థిక సాయం



తుఫాన్ బాధితులకు నగదు అందజేస్తున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

ఎచ్చెర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌కు సంబంధించి డి.మత్స్యలేశం గ్రామంలోని 53 మంది బాధితులకు ప్రభుత్వం మంజూరు చేసిన రూ.1,000 వంతున ఆర్థిక సాయాన్ని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు గురువారం అంజేశారు. ఈ కుటుంబాలకు 50 కిలోల బియ్యం, నిత్యావసర వస్తువులను ఒకటి, రెండు రోజుల్లో అందజేస్తామన్నారు. డి.మత్స్యలేశం, బడివానిపేట, బుడగట్లపాలెం తదితర గ్రామాలకు చెందిన మత్స్యకార కుటుం బాలకు అదనంగా రేషన్ సరుకులను పంపిణీ చేస్తామన్నారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, టీడీపీ జిల్లా మాజీ అధ్యక్షుడు చౌదరి నారాయణమూర్తి, టీడీపీ మండల అధ్యక్షుడు బెండు మల్లేశ్వరరావు, తహసీల్దార్ బి.గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

రూ.8.3 కోట్లతో ప్రతిపాదనలు

గార, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు పది పంచాయతీ రోడ్లు పాడైనట్లు గుర్తించి, వీటి అభివృద్ధికి రూ.8.3 కోట్ల అంచనాలు రూపొందించి ఉన్నతాధికారులకు పంపినట్లు ఆ శాఖ ఏఈ కేసీహెచ్ మహంతి తెలిపారు. వీటిలో గార మండలంలో ఆరు, శ్రీకాకుళం మండలంలో నాలుగు రోడ్ల అభివృద్ధికి అంచనాలు రూపొందించామన్నారు.

'ఉపాధి' నిధులతో గ్రామాభివృద్ధి

సరుబుజ్జిలి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పథకంలో వచ్చే నిధులతో గ్రామాన్ని అభివృద్ధి చేసు కుందామని గ్రామసభలో నిర్ణయించారు. బూర్జ మండలం ఓవీపేటలో సర్పంచ్ మెట్ట అమ్మాజమ్మ అధ్యక్షతన గురువారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రతి ఒక్క ఇంటికి కంపోస్టు పిట్స్, సోప్ పిట్స్ తవ్వాలన్నారు. గ్రామ పారిశుద్ధ్యం మెరుగుపరచడంలో సహకరించాలని కోరారు. వైస్ ఎంపీపీ బుడుమూరు సూర్యారావు మాట్లాడుతూ.. రానున్న ఏడాదిలో గ్రామంలోని చెరువుల పూడికతీత, రైతు పొలాల్లో మొక్కల పెంపకం, అంతర పంటలు వేయడం వంటి పనులు చేసి గ్రామాభివృద్ధి చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు బుడుమూరు సత్యం, గ్రామ ఫీల్డ్ అసిస్టెంట్ ప్రసాదరావు, అధికారులు పాల్గొన్నారు.

బాధితులకు న్యాయం చేయండి



సమీక్షిస్తున్న ఎమ్మెల్యే అశోక్

కవిటి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ ప్రభావంతో గ్రామాల్లో నష్టపోయిన బాధితులందరికీ న్యాయం చేయాలని ఎమ్మెల్యే, విప్ బెందాళం అశోక్ అన్నారు. రామయ్యపుట్టుగలో తన స్వగృహంలో ఇచ్ఛాపురం, కవిటి మండల రెవెన్యూ అధికారులతో గురువారం సమీక్షించారు. తుఫాన్ వల్ల అధికశాతం వర్షాలు కురవ డంతో నష్టం జరిగిన అన్ని అంశాలపై నివేదికలు సిద్ధం చేయాలన్నారు. ఇళ్లు కోల్పోయిన వారి జాబితాను తయారు చేసి వారికి సాయం త్వరితగతిన పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్లు బి.మురళీమోహన్, కె.వెంకటరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేటు యూనివర్సిటీ బస్సు బోల్తా

● ఐదుగురు విద్యార్థులకు గాయాలు



బోల్తాపడిన బస్సు

ఆమదాలవలస, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస మండలం జొన్నవలస సమీపంలో గురువారం రాత్రి పర్లాకిమిడికి చెందిన ఓ ప్రైవేటు యూనివర్సిటీకి చెందిన బస్సు ప్రమాదవశాత్తు బోల్తాపడింది. పర్లాకిమిడి నుంచి ఆమదాలవలస వైపు వస్తుండగా బోల్తాపడగా.. ఐదుగురు విద్యార్థులకు గాయాలయ్యాయి. స్థానికులు వెంటనే స్పందించి 108లో చికిత్స నిమిత్తం శ్రీకాకుళం రిమ్స్‌కు తరలించారు. ప్రమాదం విషయం తెలుసుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆందోళనకు గురయ్యారు. ఘటన సమాచారం అందినట్లు పోలీసులు తెలిపారు.

అభివృద్ధి పనులకు నిధులు

ఆమదాలవలస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): ఆమదాలవలస, పొందూరు మండలాల్లోని వివిధ గ్రామాల్లో సీసీ రోడ్లు, కాలు వలకి రూ.10.91 కోట్లు మంజూరైనట్లు ఎమ్మెల్యే కార్యాలయం ప్రతినిధి పేర్కొన్నారు. ఆమదాలవలసకి రూ.6.25 కోట్లు, పొందూరుకి రూ.4.66 కోట్లు ఉపాధి నిధులు కేటాయిస్తూ కలెక్టర్ ఉత్తర్వులిచ్చార న్నారు.

వర్షాలకు తొమ్మిదిళ్లకు నష్టం

గార, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ కారణంగా కురిసిన వర్షాలకు మండలంలో ఏడు ఇళ్లు పాక్షికంగా, రెండు ఇళ్లు పూర్తిగా కూలినట్లు తహసీల్దార్ చక్రవర్తి తెలిపారు. రామభద్రపురం పంచాయతీలో రెండు, తోణంగిలో మూడు, తూలుగులో ఒకటి, వమరవల్లిలో రెండు, వత్సవలసలో ఒక ఇంటికి నష్టం వాటిల్లిందని పేర్కొన్నారు.

బ్రాహ్మణతర్లా వద్ద పొదల్లో చిక్కుకుని..

● వరహాల గెడ్డలో గల్లంతైన వ్యక్తి మృతదేహం గుర్తింపు




పొదల్లో చిక్కుకున్న మృతదేహాన్ని బయటకు తీస్తున్న దృశ్యం



లావణ్య(ఫైల్)

పలాస రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): పలాస మండలం కేదారిపురం వద్ద వరహాలగెడ్డలో బుధవారం మధ్యాహ్నం గల్లంతైన వ్యక్తి మృతదేహం గురువారం సాయంత్రం నాటికి బ్రాహ్మణతర్లా ప్రధాన గెడ్డ అయిన వరహాలగెడ్డలో లభ్యమైంది. వివరాల్లోకి వెళ్తే.. పలాస మండలం కేదారిపురం వరహాలగెడ్డలో చేపల వేటకు వెళ్లిన దానగొర గ్రామానికి చెందిన సవర లావణ్య (38) గల్లంతయ్యాడు. స్థానికులు ఆ ప్రాంతంలో వెదికినా లావణ్య ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో ఎన్డీఆర్ఎఫ్ బృందం బుధవారం సాయంత్రం నుంచి రెండు ప్రత్యేక బోట్లలో అర్ధరాత్రి వరకూ వెతికినా ఫలితం లేకపోయింది. గురువారం సాయంత్రానికి బ్రాహ్మణతర్లా వద్ద గెడ్డలోని నీటి పంపుల గల పొదల్లో చిక్కుకుని ఉండడాన్ని స్థానికులు గుర్తించారు. స్థానికుల సాయంతో సవర లావణ్య మృతదేహాన్ని అతి కష్టమీద బయటకు తీశారు. సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పలాస ప్రభుత్వాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. నిరుపేదైన లావణ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని ఆ గ్రామస్థులు కోరుతున్నారు. ట్రాక్టరు డ్రైవర్‌గా పనిచేస్తున్న లావణ్య అర్ధాంతరంగా మృతి చెందడంతో ఆ కుటుంబం రోడ్డున పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. లావణ్యకు భార్య అన్నెమ్మ ఇద్దరు పిల్లలు ఉన్నారు.


గుండెపోటుతో ఏఎస్ఐ మృతి



అప్పన్న (ఫైల్)

మెళియాపుట్టి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): స్థానిక పోలీసు స్టేషన్‌లో ఏఎస్ఐగా విధులు నిర్వహిస్తున్న డీబీ అప్పన్న(56) గురువారం గుండెపోటుతో మృతి చెందినట్టు ఎస్ఐ పిన్నింటి రమేష్‌బాబు తెలిపారు. ఎస్ఐ తెలిపిన వివరాల మేరకు.. గురువారం మెళియాపుట్టి రోడ్డులో ఒడిశా రాష్ట్రానికి చెందిన మంత్రి వెళ్తుండడంతో జంక్షన్‌లో అప్పన్న విధుల్లో ఉన్నారు. మంత్రి కాన్వాయ్ వెళ్లిపోయిన తర్వాత చాపరలో కుటుంబంతో కలిసి అద్దెకు ఉంటున్న ఆయన భోజనానికి ఇంటికి వెళ్లారు. సుమారు రెండు గంటల సమయంలో గుండెల్లో మంటగా ఉందని స్టేషన్ విధుల్లో ఉన్న హెచ్‌సీ రమణకు ఫోన్‌లో సమాచారం ఇచ్చారు. రమణ వెళ్లేసరికి చాపర ఆరోగ్యకేంద్రానికి తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండడంతో టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తరలించారు. అప్పటికే అప్పన్న మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. అప్పన్న స్వగ్రామం ఎచ్చెర్ల మండలం ఏఆర్ పోలీసు క్వార్టర్స్ (లింగాలపేట) ఏరియా. ఆయనకు భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కాగా 1989లో అప్పన్న కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి 2021లో ఏఎస్ఐగా ఉద్యోగున్నతి పొందారు. అప్పటి నుంచి మెళియాపుట్టిలోనే విధులు నిర్వహిస్తు న్నారు. అందరితో స్నేహంగా ఉండే అప్పన్న మృతిపై పాతపట్నం సీఐ సన్యాసి నాయుడు, ఎస్ఐ రమేష్‌బాబు, ఎస్‌బీ, హెచ్‌సీ సింహాచలం తదితరులు విచారం వ్యక్తం చేసి, అతడి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో ఏఎన్ఎం..



మాలతి(ఫైల్)

కొత్తూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కడుము-శిడిగాం రోడ్డులో గురువారం జరిగిన ప్రమాదంలో కడుము ఏఎన్ఎం ఆర్.మాలతీబాయి(48) మృతి చెందినట్టు హెచ్‌సీ కోటేశ్వరావు తెలిపారు. హెచ్‌సీ తెలిపిన వివరాల మేరకు.. కురిగాం పీహెచ్‌సీ పరిధిలో ఉన్న కడుము ఏఎన్ఎంగా విధులు నిర్వహిస్తున్న మాలతి కన్నవారి గ్రామం ఒడిశా రాష్ట్రం కాశీనగరంలో నివాసం ఉంటున్నారు. మాలతి ఎప్పటిలాగే కడుము సచివాలయానికి విధుల కోసం ద్విచక్ర వాహనంపై వస్తుండగా.. ప్రమాదవశాత్తు రోడ్డుపై పడిపోవడంతో తలకు బలమైన గాయమై అక్కడిక్కడే మృతి చెందారు. ఘటనా స్థలానికి పోలీసులు చేరుకుని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పాతపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించిన తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసినట్టు హెచ్‌సీ తెలిపారు.

విధుల్లో అస్వస్థతకు గురై ఆర్మీ జవాన్..

● సైనిక లాంఛనాలతో అంతిమయాత్ర




నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే గొండు శంకర్



రాజు (ఫైల్)

శ్రీకాకుళం రూరల్, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నగర సమీపంలోని భైరి గ్రామానికి చెందిన ఆర్మీ జవాన్ వెంపటాపు రాజు(35) విధి నిర్వహణలో అస్వస్థతకు గురైమృతి చెందారు. రాజు ఢిల్లీలో విధులు నిర్వహిస్తుండగా మంగళవారం ఆకస్మాత్తుగా కుప్పకూలిపోయాడు. వెంటనే సహచర జవాన్లు ఆసుపత్రికి తరలించగా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. రాజు మృతదేహాన్ని గురువారం స్వగ్రామమైన భైరి గ్రామానికి తీసుకువచ్చారు. విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే గొండు శంకర్ మృతదేహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కాగా రాజు మృతదేహానికి సైనిక లాంఛనాలతో అంత్యక్రియలు నిర్వహించారు. వందలాది మంది గ్రామస్థులు అంతిమయాత్రలో పాల్గొన్నారు. రాజుకి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు.

నడగాంలో పాముకాటుతో రైతు..



రామదాస్ (ఫైల్)

నరసన్నపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నడగాం గ్రామానికి చెందిన కరణం రామదాస్(47) పాముకాటుకు గురై మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. రామదాస్ తన పొలానికి వెళ్లి పనులు ముగించుకుని తిరిగి వస్తుండగా గట్టుపై ఉన్న పాము కాటువేసింది. వెంటనే రోడ్డుపైకి చేరుకుని గ్రామస్థుల సహకారంతో ద్విచక్ర వాహనంపై చికిత్స నిమిత్తం నరసన్నపేట ఏరియా ఆసుపత్రి వెళ్లాడు. అయితే అప్పటికే నోటి నుంచి నురగలు కక్కుతూ పడిపోయాడు. వైద్యులు పరిశీలించి మృతి చెందినట్టు ధ్రువీకరించారు. రామదాస్ భార్య రాజు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ దుర్గాప్రసాద్ తెలిపారు. రామ్‌దాస్‌కు భార్యతోపాటు ఇద్దరు కుమారులు ఉన్నారు.

40 మద్యం సీసాలతో ఒకరి అరెస్టు

టెక్కలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): బూరగాంలో బెల్టుషాపు నిర్వహిస్తున్న వ్యక్తిని అరెస్టు చేసి 40 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు ఎక్సైజ్ సీఐ ఎస్‌కే మొహరా సాహెబ్ తెలిపారు. ఇప్పటి వరకు దాడులు చేసి 79 కేసులు నమోదు చేశామని, 584 మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. బెల్టుషాపులు నిర్వహించేవారిని ఇప్పటివరకు బైండోవర్ చేశామని, ఒకపై రిమాండ్‌తో పాటు రూ.2లక్షలు జరిమానా విధించే అవకాశం ఉందన్నారు.

అదుపు తప్పితే అంతే!

● కిల్లాం వద్ద ప్రమాదకరంగా పోలాకి చానల్‌పై వంతెన



రెయిలింగ్ ఊడిపోవడంతో ప్రమాదకరంగా మారిన వంతెన

నరసన్నపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): కిల్లాం గ్రామం వద్ద పోలాకి చానల్ పై వంతెన రైలింగ్ విరిగిపోయి శిథిలావ్యవస్థకు చేరింది. ఈ వంతెనపై ప్రయాణం చేసే సమయంలో అదుపు తప్పితే పెనుప్రమాదం తప్పదు. నరసన్నపేట నుంచి ఈదులవలస, కిల్లాం మీదుగా మబుగాం, కత్తిరివానిపేట వందలాది మంది వాహనాలపై ప్రతి రోజూ రాకపోకలు సాగిస్తుంటారు. రాత్రి సమయంలో అదుపు తప్పితే ఇక 20 అడుగుల లోతులో ప్రవహించే పోలాకి గెడ్డలో పడితే ఇక అంతే సంగతులు. ఈ మార్గంలో రోజుకు ఒక్కసారైనా ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, మాజీ ఎమ్మెల్యే ధర్మాన కృష్ణదాస్ రాకపోకలు సాగిస్తుంటారు. గత ప్రభుత్వ హయాం నుంచి రెయిలింగ్ దెబ్బతిన్నా అప్పుడు పట్టించుకోలేని నాయకులు, అధికారులు కనీసం కూటమి ప్రభుత్వంలోనైనా స్పందించి రెయిలింగ్ మరమ్మతులు చేయాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తా: ఎమ్మెల్యే శిరీష




కొట్టుకుపోయిన రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే శిరీష, టీడీపీ నాయకులు

పలాస/రూరల్, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): తుఫాన్ ప్రభావంతో జరిగిన నష్టంపై ప్రభుత్వానికి నివేదిస్తామని ఎమ్మెల్యే గౌతు శిరీష తెలిపారు. ఈ మేరకు గురువారం ముంపునకు గురైన ప్రాంతాల్లో ఆమె పర్యటించి బాధితులతో మాట్లాడారు. పర్యటించారు. ఈ సందర్భంగా ఆమె విలేకరులతో మాట్లాడుతూ.. నియోజకవర్గంలో అనేక ప్రాంతాల్లో పంట పొలాలు నీటమునిగాయని, రోడ్లు వరదనీటి ప్రవాహానికి కొట్టుకుపోయా వని, చెట్లు కూడా కూలిపోయాయన్నారు. దీనిపై సమగ్ర నివేదికను ప్రభుత్వాని కి సమర్పించి నష్టపరిహారం అందేలా చూస్తానన్నారు. పాడైన రోడ్లు, కల్వర్టను పున: నిర్మాణానికి అవసరమైన చర్యలు తీసుకోనున్నట్టు తెలిపారు. టీడీపీ నాయకులు వజ్జ బాబూరావు, పీరుకట్ల విఠల్‌రావు, లొడగల కామేశ్వరరావు యాదవ్, మల్లా శ్రీనివాస్, బడ్డ నాగరాజు, గురిటి సూర్యనారాయణ, తమ్మినేని గంగారామ్, జోగ మల్లి ఉన్నారు.

● హరిపురం: తుఫాన్‌తో నష్టపోయిన వరి, జీడి, మామిడి, కొబ్బరి రైతులను ఆదుకుంటామని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. మందస మండలం కుంటికోట, పాతకమలాపురం, చీపి పంచాయతీలోని పలు గిరిజన గ్రామాల్లో ఆమె గురువారం పర్యటించారు. అనంతరం బీఎస్‌పురం గ్రామ సచివాలయాన్ని పరిశీలించారు. వ్యవసాయశాఖ ఏడీ రామారావు, ఏవో నాగరాజు, ఏఈ శ్రీనివాసరావు, టీడీపీ నాయకులు బావన దుర్యోధన, పీరుకట్ల విఠల్, తమిరి భాస్కరరావు, రట్టి లింగరాజు, బమ్మిడి కర్రయ్యదాసరి తాతారావు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

శాశ్వత ప్రయోజనం చేకూరేలా చర్యలు



మాట్లాడుతున్న ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

పాతపట్నం, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): రైతులకు దీర్ఘకాలికంగా శాశ్వత ప్రయోజనం చేకూరేలా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ యార్డ్‌లో గురువారం జరిగిన పాలకమండలి సర్వసభ్యుల సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రైతులకు నిరంతరం సేవలందించేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. సమావేశంలో ఏఎంసీ చైర్మన్ చిమ్మింటి గౌరమ్మ, వైస్ చైర్మన్ మడ్డు రామారావు, సభ్యులు సీమ మీనాక్షిదేవి, బంటుపల్లి జయలక్ష్మి, జమన రాము, పొట్నూరు లక్ష్మి, సవర రమేష్ గండుబరికి గణపతి, నందిగామ కృష్ణవేణి సయ్యద్, గోకవలస చంద్రశేఖర్, రాజాన రమణి, పడాల శ్రీను, బోను సరస్వతి చింతల ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంతో ప్రయోజనం

జలుమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): వైపరీత్యాలను తట్టుకొని పంట నష్టం జరుగకుండా ఉండడానికి ప్రకృతి వ్యవసాయంతోనే సాధ్యపడుతుందని జిల్లా ప్రాజెక్టు మేనేజరు పూజారి సత్యనారాయణ అన్నారు. యలమంచిలిలోను, సారవకోట మండలం జగ్గయ్యపేటలోను సాగు చేసిన ప్రకృతి వరి వ్యవసాయాన్ని గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తుఫాన్ తాకిడికి పకృతి వ్యవసాయం తట్టుకొనే అంశాలను అధ్యయనం చేస్తున్నట్టు ఆయన వివరించారు. ప్రకృతి వ్యవసాయంతో చీడపీడలు నివారించుకోవచ్చన్నారు. ఈ పరిశీలనలో ఉత్తర కోస్తా రీజనల్ టెక్నికల్ బృందం కె.ప్రకాష్, హేమసుందర్, పకృతి వ్యవసాయ సిబ్బంది గోవిందరెడ్డి, మాస్టర్ ట్రైనర్ తోట రమణ, మెంటర్ రమణమ్మ, మోడల్ మేకర్ జగదీశ్వరరావు, డీపీపీ వంశీకృష్ణ రైతులు పాల్గొన్నారు.

తుఫాన్ బాధితులకు అండగా ఉంటాం

పోలాకి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ బాధితులకు అండగా ఉంటామని జనసేన పార్టీ నియోజకవర్గ నాయకులు అన్నారు. గురువారం పలువురు కొత్తరేవు, గుల్లవానిపేట, రాజారాంపురం, గుప్పెడుపేట సాగరతీర గ్రామాల్లో పర్యటించి మాటాల్డఆరు. మత్స్యకారులు ఎదుర్కొంటున్న సమస్యలను పార్టీ అధినేత పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లామన్నారు. జనసేన పార్టీ నాయకులు మెట్ట వైకుంఠరావు, ఎం.దండాసి, వారి అనుచరులు గ్రామాల్లోని మహిళలు, మత్స్యకారులతో మాట్లాడారు. నాయకులు వైకుంఠరావు తదితరులు ఉన్నారు.

● మెళియాపుట్టి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్‌లో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని జనసేన పార్టీ నాయకులు దుక్క బాలరాజు తెలిపారు. బురువారం కడబ మర్రిపాడు గ్రామాల్లో పర్యటించారు. కార్యక్రమంలో ఉమపతి తదితరులు ఉన్నారు.

జాగ్రత్తలతో పంట నష్టాన్ని తగ్గించుకోవచ్చు



వరి పంటను పరిశీలిస్తున్న వ్యవసాయ శాస్త్రవేత్తలు

జలుమూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నీట మునిగిన వరిపంటను తగు జాగ్రత్తలు పాటించి నష్టాన్ని నివారించుకోవచ్చని వ్యవసాయ శాస్త్రవేత్తలు కె.భాగ్యలక్ష్మి, ఉదయ్‌బాబు అన్నారు. యలమంచిలి, సురవరం, దొంపాక, తిమడాం, కొమనాపల్లి తదితర గ్రామాల్లో నీట మునిగిన వరిచేలు పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. నేలకొరిగి నీటిలో ఉన్న కంకెలు మట్టి పట్టకుండా కట్టలు కట్టి నిలబెట్టాలని సూచించారు. నరసన్నపేట వ్యవసాయశాఖ ఏడీ ఎల్.వి.మధు, ఏవో కె.రవికుమార్, పలువురు రైతులు పాల్గొన్నారు.

250 ఎకరాల్లో పంట నష్టం

కొత్తూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): తుఫాన్ దెబ్బకు మండలంలోని 250 ఎకరాల్లో పంట పంట నష్టం జరిగిందని ఏవో ఎస్వర్ణలత తెలిపారు. గురువారం కర్లెమ్మ రెవెన్యూ పరిధిలో నష్టపోయిన పత్తి పంటను వ్యవసాయ శాఖ శాస్త్రవేత్తల బృందంతో కలిసి పరిశీలించారు. 43 పంచాయతీల పరిధిలో వరి పంట 100 ఎకరాల్లోను, పత్తి 150 ఎకరాల్లో నష్టం జరిగినట్టు గుర్తించామన్నారు. ఉన్నతాధికారులకు నివేదించనున్నట్టు తెలిపారు. ఏడీ రాజగోపాలరావు, శాస్త్రవేత్త వెంకటరావు పాల్గొన్నారు. ● తుఫాన్ తాకిడికి, వరదలకు నష్టపోయిన మాకవరం, వీరనారయణపురం, కుద్దిగాం రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తూర్పుకాపు కార్పొరేషన్ డైరెక్టర్ పొత్రకొండ మోహనరావు కోరారు.

గిరిజనులకు సాగుపట్టాలివ్వండి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న దృశ్యం

మందస, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కొండలోగాం రెవెన్యూ పరిధి చాప రాయి కాలనీలో గల గిరిజనులకు చెందిన భూములకు సాగుపట్టాలు ఇవ్వాలని వామపక్షపార్టీల నాయకులు కోరారు. ఈ మేరు గురువారం తహసీల్దార్ ఎం.శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వామపక్ష నాయకులు మాట్లాడుతూ.. గిరిజనులు సాగు చేసుకుంటున్న జిరాయితీ, డీ పట్టా భూముల్లో రీసర్వే పేరుతో గిరిజనేతరుల పేర్లు నమోదు కావడంపై గిరిజనులు ఆందోళనకు గురవుతున్నారని, రెవెన్యూ అధికారులు ఈ విషయంలో శ్రద్ధ వహించి గిరిజనులకు సాగుపట్టాలిప్పించాలని ఆ వినతిలో పేర్కొన్నారు. రైతు సంఘ నాయకులు కోనారి మోహనరావు, తామాడ సన్యాసిరావు, కోనేరు రమేష్, మద్దిల రామారావు, సవర నర్సింహులు, సవర మాధవరావు, జయరాజ్ సావిత్రి పాల్గొన్నారు. కాగా ఈ నెల 5వతేదీన దీనిపై హియరింగ్ ఏర్పాటు చేయడం జరుగుతుందని తహసీల్దార్ వారికి తెలిపారు.

పంటలు పరిశీలన



కోటబొమ్మాళి: కూరగాయల పంటను పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

కోటబొమ్మాళి, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): గట్లపాడు గ్రామంలో రైతుల సాగు చేస్తున్న టమాట, కాలీఫ్లవర్, బెండ తదితర పంటలను ఆమదాలవలస, పెద్దపేటకు చెందిన ఉద్యాన పరిశోధన కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ నరసింహమూర్తి, డాక్టర్ రాజశేఖర్ గురువారం ఉద్యానశాఖ అధికారి కె.సునీతతో కలిసి పరిశీలించారు. తుఫాన్ ప్రభావం వల్ల కూరగాయల పంటలు పాడవ్వకుండా ఉండాలంటే 19.19.19 లేదా మల్టీకే 5 గ్రాములు, కొద్దిగా యూరియా వేసి పిచికారి చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఉద్యాన విస్తరణాదికారి ఆమని, వ్యవసాయ విస్తరణాధికారి మధు కిరణ్, రైతులు పాల్గొన్నారు

● నరసన్నపేట: తుఫాన్ ప్రభావంతో దెబ్బతిన్న పంటలను వ్యవసాయ శాస్త్రవేత్తలు గురువారం కంబకాయి, నర్సింగపల్లి తదితర గ్రామాల్లో పరిశీలించారు. నేలకొరిగిన వరిచేనుపై ఉప్పుద్రావణం పిచికారీ చేయాలని సూచించారు. కృషి విజ్ఞాన కేంద్ర శాస్త్రవేత్త కె.భాగ్యలక్ష్మి, రాగోలు వ్యవసాయ పరిశోధన సంస్థ శాస్త్రవేత్త పి.ఉదయ్‌బాబు, ఏవో సూర్యకుమారి తదితరులు పాల్గొన్నారు.

అలాగే కిల్లాం, మాకివలస గ్రామాల్లో ముంపుకు గురైన పంట పొలాలను తహసీల్దార్ ఆర్. సత్యన్నారాయణ పరిశీలించారు. ఆర్ఐ సాయిరాం, ఆర్‌బీ రామన్న ఉన్నారు.

● వజ్రపుకొత్తూరు: తుఫాన్ ప్రభావందతో నీట మునిగిన పంటపొలాలను రైతు సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె.మోహనరావు గురువారం పరిశీలించారు. ఏటా బెండి, నగరంపల్లి పంచా యతీల పరిధిలోని పొలాలకు ముంపు తప్పడం లేదన్నారు. నాయకులు బాలజీ, టి.భాస్కరరావు ఉన్నారు.

● నందిగాం: తుఫాన్ ప్రభావంతో నేలకొరిగిన చేనును కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ పద్ధతులు పాటించాలని ఏవో పి.శ్రీకాంత్‌వర్మ సూచించారు. గురువారం ఉయ్యాలపేట, లఖిదాసుపురం, మొండ్రాయివలస గ్రామాల్లో పర్యటించి పంటలను పరిశీలించారు. ఏఈవో పి.వాసవి, వీఏఏలు ఉన్నారు.

శిథిల భవనాల్లో తరగతులు నిర్వహించొద్దు

నరసన్నపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): శిథిలావ్యవస్థలో ఉన్న పాఠశాలలో తరగతులు నిర్వహించవద్దని ఆర్వీఎం ఈఈ గణపతిరావు సూచించారు. గురువారం స్థానిక వంశధారనగర్‌లో గల ప్రాథమిక పాఠశాలను పరిశీలించారు. పాఠశాల భవనాలు శిథిలమైనట్టు గుర్తించారు. వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు తడిచి ఏక్షణమైనా కూలీ ప్రమాదం ఉందని అందుకు సురక్షిత ప్రాంతాలకు తరగతులను తరలించాలని ఎంఈవోలకు సూచించారు. కార్యక్రమంలో ఆర్వీఎం ఏఈ చంద్రమౌళి, ఎంఈవో దాలినాయుడు, హెచ్ఎం రజనీ తదితరులు పాల్గొన్నారు.

పోలీసులు ప్రజల్లో భాగస్వాములే

పలాస, అక్టోబ రు 30(ఆంధ్రజ్యోతి): పోలీసులు ప్రజల్లో భాగస్వాములే అన్న విషయాన్ని ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలని కాశీబుగ్గ సీఐ పి.సూర్య నారాయణ తెలిపారు. పోలీసు అమరవీరుల స్మారక దినోత్సవం సందర్భంగా గురువారం విద్యార్థులకు పోలీసు విధులను వివరించారు. సీఐ మాట్లాడుతూ పోలీసు విధులు వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐ నర్సింహమూర్తి, ఏఎస్ఐ గణపతిరావు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.


డీసీఎంఎస్ అభివృద్ధికి కృషి

అరసవల్లి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): డీసీఎంఎస్ అభివృద్ధికి కృషి చేస్తామని ఆ సంస్థ చైర్మన్ చౌదరి అవినాష్ అన్నారు. స్థానిక డీసీఎంఎస్ కార్యాలయంలో గురువారం 'రోల్ ఆఫ్ డీసీఎంఎస్' వర్క్‌షాప్ నిర్వహించారు. డీసీఎంఎస్ ద్వారా ప్రభుత్వ పాఠశాలలు, వసతి గృహాలు, ప్రభుత్వ సంస్థలకు నిత్యావసర వస్తువులు, స్టేషనరీ సరఫరా, సీజన్లలో ధాన్యం కొనుగోలు, ఎరువుల వ్యాపారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. రైతులకు నాణ్యమైన పశువుల దాణా, టార్పాలిన్లు, వ్యవసాయ పనిముట్లు తక్కువ ధరకే అందిస్తున్నామ న్నారు. కార్యక్రమంలో జిల్లా కోపరేటివ్ అధికారి మురళీకృష్ణ, చంటిబాబు, టెక్కలి ఆర్డీవో కృష్ణమూర్తి, కె.దామో దరరావు, జగ్గునాయుడు తదితరులు పాల్గొన్నారు.

నిర్దేశిత లక్ష్యాలను చేరుకోవాలి

పాతపట్నం, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): నిర్దేశితలక్ష్యాలను చేరుకోకుంటే చర్యలు తప్పవని పశు సంవర్ధకశాఖ టెక్కలి డివిజనల్ ఏడీ సీహెచ్ నరసింహులు తెలిపారు. స్థానిక ప్రాంతీయ పశు వైద్యశాలలో పాతపట్నం, మెళియాపుట్టి మండలాల పరిధిలోని శాఖాధికారులు సిబ్బందితో గురువారం సమీక్షించారు. పశుకిసాన్ క్రెడిట్‌కార్డు పాడిరైతుకందేలా చర్యలు తీసుకోవాన్నారు. పాతపట్నం ఏడీ ఎం.కరుణాకరరావు, పశువైద్యులు పి.అనిల్, బి.శ్రీవాణి కె.మౌనిక, పశువైద్యసిబ్బంది పాల్గొన్నారు.

జాతీయస్థాయి పోటీలకు ఎంపిక



విద్యార్థులను అభినందిస్తున్న దృశ్యం

పోలాకి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరంలో జరిగిన అండర్ 19 రాష్ట్రస్థాయి అథ్లెటిక్స్ పోటీల్లో సత్తాచాటి జాతీయ పోటీలకు ఈదులవలస మోడల్ స్కూల్ విద్యార్థులు ఎంపికైనట్టు ప్రిన్సిపాల్ పైడి ప్రవీణ, పీడీ ఎం.నీలం తెలిపారు. గురువారం మోడల్ స్కూల్ ప్రాంగణంలో లాంగ్‌జంప్‌లో ప్రథమ స్థానంలో నిలిచిన డి.బాను(ద్వితీయ హెచ్ఈసీ), 200 మీటర్లలో ద్వితీయ, డిస్కస్‌త్రోలో తృతీయ స్థానంలో నిలిచిన పి.తేజేశ్వరిని అభినందించారు.

ఘనంగా ముస్లింల జెండా పండుగ

ఆమదాలవలస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని 11వ వార్డు ముస్లిం కాలనీలో గౌస్ ఆలంగ్యార్ఫీహ్ షరీఫ్ జెండా పండుగను గురువారం నిర్వహించారు. టీడీపీ నాయకుడు, ముస్లిం మతపెద్ద షేక్‌మాలిక్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముస్లింలు పాల్గొని సంప్రదాయం ప్రకారం ప్రత్యేక కార్యక్రమం చేపట్టారు. తమ్మినేని గీత, రమేష్, గోవిందరావు పాల్గొన్నారు.

గర్భం దాల్చిన బాలిక

● చికిత్స కోసం రావడంతో వెలుగులోకి..

సంతబొమ్మాళి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఓ గ్రామానికి చెందిన ఇంటర్మీడియట్ చదువుతున్న ఓ బాలిక గర్భం దాల్చిన ఘటన వెలుగులోకి వచ్చింది. చికిత్స నిమిత్తం గురువారం టెక్కలి జిల్లా కేంద్రాసుపత్రికి తీసుకురాగా.. పరీక్షించిన వైద్యులు ఆమె గర్భవతిగా నిర్ధారించడంతో విషయం బయటపడింది. ఆ బాలిక తన పక్క ఇంట్లో ఉంటున్న యువకుడితో ఉన్న పరిచయం ప్రేమగా మారింది. ఈ క్రమంలో ఆ బాలిక గర్భం దాల్చింది. ఈ విషయం ఆ గ్రామ పెద్దల దృష్టికి తీసుకురావడంతో ఇరు కుటుంబాలతో చర్చించి ఒక అంగీకారానికి వచ్చినట్టు తెలిస్తుంది. ఈ క్రమంలో చికిత్స కోసం ఆసుపత్రికి తీసుకురావడంతో విషయం బటపడింది. దీనిపై పోలీసులను సంప్రదించేందుకు ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

గ్రావెల్‌తో వాహనాల పట్టివేత



వాహనాలను సీజ్ చేస్తున్న తహసీల్దార్, ఎస్ఐలు

ఎచ్చెర్ల, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అరిణాం అక్కివలస జంక్షన్ సమీపంలో అక్రమంగా తరలిస్తున్న గ్రావెల్ వాహనాలను గురువారం రాత్రి అధికారులు పట్టుకున్నారు. తహసీల్దార్ బి.గోపాల్ తెలిపిన వివరాల ప్రకారం... అరిణాం అక్కివలసకి సమీపంలోని ఓ ప్రైవేటు స్థలాన్ని చదును చేసేందుకు ఎటువంటి అనుమతులు లేకుండా గ్రావెల్ తరలిస్తున్నట్టు వచ్చిన సమాచారం మేరకు పట్టుకున్నామన్నారు. సమీప మండలం నుంచి గ్రావెల్‌ను తరలిస్తున్నట్టు గుర్తించామన్నారు. ఎక్స్‌కవేటర్, టిప్పర్‌ను స్వాధీనం చేసుకుని గనుల శాఖ అధికారులకు అప్పగించామన్నారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ దాడుల్లో ఎస్ఐ వి.సందీప్‌కుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం



అదృశ్యమైన తేజ

లావేరు, అక్టోబరు 30 (ఆంధ్రజ్యోతి): కొత్తకుంకాం గ్రామానికి చెందిన వివాహిత కూనపల్లి తేజ ఈనెల 28 రాత్రి 10 గంటల నుంచి కనిపించడం లేదని ఆమె భర్త ఇజ్జు వెంకటరమణ గురువారం లావేరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. వీరికి జూన్ 5న వివాహమైంది. భర్త ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి చేసినట్టు ఏఎస్ఐ ఎం.రాజారావు తెలిపారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి ఎమ్మెల్యే శంకర్ పరామర్శ

టెక్కలి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): రావివలస మాజీ సర్పంచ్ బడే వైకుంఠరావునాయుడు మృతి చెందడంతో ఆ కుటుంబాన్ని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ గురువారం పరామర్శించారు. ఆయన గ్రామానికి వచ్చిన కుటుంబసభ్యులు మనోహరరావు, రెడ్డిబాబు, జగదీశ్వరరావు కలిసి మృతికి గల కారణాలను తెలుసుకొని సంతాపం తెలిపారు.

నేడు రాష్ట్రీయ ఏక్తా దివస్

నరసన్నపేట, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): అఖండ భారతావనిని ఒక్కటిగా నిలిపిన సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతి సందర్భంగా జిల్లా కేంద్రంలో రాష్ట్రీయ ఏక్తా దివస్ (జాతీయ ఐక్యతా దినోత్సవం) శుక్రవారం నిర్వహించనున్నట్లు ఏక్తా దివాస్ పాదయాత్ర జిల్లా కోఆర్డినేటర్ చింతు పాపారావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యాక్రమంలో యువత పాల్గొని పటేల్ చేసిన కృషిని గుర్తించాలని కోరారు.

ఆర్థిక సాయం

వజ్రపుకొత్తూరు, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): టెక్కలి మండలం బన్నువాడ గ్రామానికి చెందిన చిన్నారి బెక్షిత్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న చినవంక గ్రామానికి చెందిన మైటీ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు రూ.30116 ఆర్థిక సాయం అందజేశారు. ప్రస్తుతం బెక్షిత్ హైదరాబాద్‌లో చికిత్స పొందుతున్నాడు. సంస్థ అధ్యక్షుడు కె.రాకేష్, సంస్థ ప్రతినిధులు రాజేష్, గోవిందస్వామి ఉన్నారు. అలాగే అమలపాడు గ్రామానికి చెందిన వాడరేవు మోహనరావు ఉపాధి కోసం విదేశాలకు వెళ్లి అనారోగ్యంతో మృతిచెందిన విషయం తెలుసుకొని.. ఉద్దానం హెల్పింగ్ హ్యాండ్స్ తరఫున ఆ కుటుంబానికి రూ.10 వేలు సాయం అందించినట్టు సంస్థ అధ్యక్షుడు తిరుపతి చెప్పారు.

రేపటి నుంచి ఆలయ వార్షికోత్సవం

కోటబొమ్మాళి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): చలమయ్యపేట గ్రామంలో వచ్చే నెల 1వ తేదీ నుంచి 3వ తేదీ వరకు అభయాంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం నిర్వహించనున్నట్టు నిర్వాహకులు గేదెల వీరన్న స్వామి గురువారం తెలిపారు. ఈ మూడు రోజులు స్వామివారి తీరువీధి, పంచామృతాభిషేకం, స్నపన్నములు, సింధూపూజ, తమలపాకు, కుంకుమ పూజలు జరుగుతాయన్నారు. చివరి రోజున మహాఅన్నసమారాధన ఉంటుందన్నారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నట్టు నిర్వాహకులు తెలిపారు.

పంటలను తెలుసుకోవాలి

మెళియాపుట్టి, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యార్థి దశ నుంచే పంటల సాగు విధానాన్ని తెలుసుకిని తల్లిండ్రులకు వివరించాలని జిల్లా భూసార వ్యవసాయ శాఖ సహాయసంచాలకులు కృష్ణారావు తెలిపారు గురువారం ఏకలవ్య పాఠశాల విద్యార్థులకు మట్టి నమునాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వ్యవసాయ అధికారులు రవికూమార్, పద్మానాభం, సుజాత, ఏఈవో ప్రభావతి తదితరులు ఉన్నారు.

పేదలందరికీ పక్కా గృహాలు

పలాస, అక్టోబరు 30(ఆంధ్రజ్యోతి): పేదలందరికీ పక్కా గృహాలు కల్పించడమే ప్రభుత్వ ధ్యేయమని మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావు తెలిపారు. గురువారం మధ్యాహ్నం అంగీకార్-2025, పీఎం ఆవాస్ యోజన-2.0 కార్యక్రమాన్ని నిర్వహించారు. మహిళలతో ర్యాలీ నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు. కమిషనర్ మాట్లాడుతూ 2025 వరకూ వివిధ కారణాల వల్ల ఆగిపోయిన గృహాలను పూర్తిగా నిర్మించడం, కొత్తగా ఇళ్లులేని వారికి గృహవసతి కల్పించడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశమన్నారు. కార్యక్రమాన్ని అంతా సద్వినియోగం చేసుకోవాలన్నారు.